# ఆర్మీ చేతికి కాముకాజి ఆయుధం

.. రూ.10 కోట్లకే వందల ఆత్మాహుతి డ్రోన్లు



03


E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 08-04-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:96 || పేజీలు–6

www.ekaburu.com




03

## జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

జల్ జీవన్ మిషన్ 2.0లో జల సంరక్షణకు ప్రాధాన్యం

ప్రజల్లోనూ చైతన్యం కలిగించాలి

100 రోజుల స్పెషల్ డ్రైవ్ కు శ్రీకారం

భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకోవడం తప్పనిసరి



02

## హైడ్రా భారీ ఆపరేషన్

ఐటీ కారిడార్‌కు చేరువలో రూ. 1200 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

8 ఎకరాలకు పైగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

ఈ కబురు, హైదరాబాద్:

ఐ. టి. కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది.



06

## ముంబై ఇండియన్స్ ను చిత్తు చేసిన రాజస్తాన్

ముంబై ఇండియన్స్‌పై రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయం

వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన మ్యాచ్



03

## శబరిమలలో మహిళలపై ఆంక్షలు సబబే

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

అయ్యప్ప స్వామి కొలువైన శబరిమల ఆలయంలో 10-50ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్థించింది.

# మీ నాగరికతను.. ఒక్కరాత్రిలో నాశనం చేస్తా

## ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- అది అణ్వాయుధమా అంటూ ఆందోళనల వెల్లువ
- కాదంటూ హడావుడిగా శ్వేతసౌధం వివరణ
- హర్మూజ్‌ను తెరిచేందుకు గడువు పొడిగించని ట్రంప్
- ఖర్‌గ్‌పై అమెరికా భీకర దాడులు
- ఇరాన్‌లో వంతెనలు, రైల్వే నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్
- ట్రంప్ ఓ ఉన్మాది... మమ్మల్ని ఏమీ చేయలేరు: ఇరాన్
- విద్యుత్కేంద్రాల చుట్టూ మానవహారాలుగా ఏర్పడాలని ప్రజలకు పిలుపు
- 1.4 కోట్ల మంది ప్రాణత్యాగానికైనా సిద్ధమేనన్న అధ్యక్షుడు పెజెష్కియాన్
- పశ్చిమాసియాలో పతాక స్థాయికి ఉత్కంఠ



**ఈ కబురు** : దాడులు.. ప్రతిదాడులు.. డెడ్‌లైన్‌లు.. సడలింపులు.. కవ్వింపులు.. బెదిరింపులతో ఆరు వారాలుగా భీకరంగా సాగుతున్న పశ్చిమాసియా యుద్ధంలో ఉత్కంఠ పతాక స్థాయికి చేరుకుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు బుధవారం తెల్లవారుజామున 5:30 గంటల (భారత కాలమానం ప్రకారం) వరకే ఉండగా.. మంగళవారం రాత్రి వరకూ ఇరాన్ రాజీకి రాలేదు. హర్మూజ్‌ను తెరిచి టెహ్రాన్ తమతో ఒప్పందానికి రాకపోతే ఒక్కరాత్రిలో ఇరాన్ నాగరికత మొత్తం నశించిపోతుందంటూ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయి హెచ్చరిక జారీ చేశారు. ఈ వ్యాఖ్యపై ఇరాన్ తీవ్రంగా మండిపడింది. అమెరికా అధ్యక్షుణ్ని ఉన్మాదిగా పేర్కొంది. సంధి కుదుర్చుకునే దిశగా సంకేతాలివ్వని ఇరాన్..

మిగతా 2లో



# మేం చేస్తున్నదే చెబుతున్నాం..

- అనుమానముంటే వచ్చి అభివృద్ధిని పరిశీలించుకోవచ్చు
- కేరళ సీఎం విజయన్‌కు రేవంత్‌రెడ్డి సూచన
- ఆయన 120 నెలల పాలన వైఫల్యానికి ప్రతీకని విమర్శ
- కేరళ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి

**ఈ కబురు, హైదరాబాద్:**

కేరళ ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ శకం ముగిసిపోయిందని, ఆయన వైదొలిగే సమయం ఆసన్నమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. పినరయి 120 నెలల పాలనా కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచిందని దుయ్యబట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏదైతే అభివృద్ధి చేస్తున్నదో.. అదే కేరళ ఎన్నికల ప్రచారంలో చెబుతున్నామని, అనుమానాలుంటే పినరయి విజయన్ తెలంగాణకు వచ్చి పరిశీలించుకోవచ్చని సూచించారు. కేరళలో ఎన్నికల ప్రచారంలో మంగళవారం పలు రోడ్‌షోలలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్‌పై విమర్శలు గుప్పించారు.

“కేరళలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించింది. దానిని మేం అభినందిస్తున్నాం. ఈ వ్యవస్థ విజయం ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది.

మిగతా 2లో



## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా

ఈ కబురు : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు.

03



## లాక్కోవడం.. ..కూల్చడమే రేవంత్ సర్కారు లక్ష్యం

- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ
- పరిగికి వెళుతున్న మాజీ మంత్రుల అరెస్టు.. నిర్బంధం

**ఈ కబురు, శంషాబాద్ :**

వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కోవడం, పేదల ఇళ్లను కూల్చడమే రేవంత్ సర్కారు లక్ష్యంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లోని భూబాధితులకు మద్దతు పలకడానికి మంగళవారం మాజీ మంత్రులు సబితారెడ్డి,

02

# పాఠ్యాంశాలు నవీకరణ

- కాలేజీ విద్య రీ-ఓరియెంటేషన్
- ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి
- విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకూడదు
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- అవేర్ 2.0 మొబైల్ యాప్ లాంఛ్ చేసిన ముఖ్యమంత్రి



ఈ కబురు,అమరావతి :

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యమూ జరగకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...”ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయలి.

మిగతా 2లో

# తొలిసారిగా భూ అస్తమయం!

అరుదైన సూర్యగ్రహణం

చంద్రబిలాల విశేషాలు

మూడు దృగ్విషయాలను కెమెరాలో బంధించిన ఆర్టిమిస్–2 వ్యోమగాములు

**ఈ కబురు, హూస్టన్: అత్యంత సుదూరాలకు మానవసహిత వ్యోమనౌక మిషన్‌ను విజయవంతంగా పూర్తిచేసి కొత్త చరిత్ర సృష్టించిన ఆర్టిమిస్–2 ప్రాజెక్ట్ వ్యోమగాములు ఒరియాన్ వ్యోమనౌక నుంచి అరుదైన విషయాలను తమ మదిలో, కెమెరాల్లో నిక్షిప్తంచేసుకుని భూమికి తిరుగు ప్రయాణం ఆరంభించారు.**

సోమవారం రాత్రి 11.30 గంటలప్పుడు చంద్రుని ఆవలి వైపునకు చేరి చరిత్రలో తొలిసారిగా ఏకధాటిగా దాదాపు ఏడుగంటలపాటు చందమామ అవతలివైపు ప్రాంతాలు, బిలాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. చంద్రతలం నుంచి దాదాపు 6,545 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణిస్తూ వాటి ఫొటోలను వ్యోమగాములు రీడ్ వైస్‌మ్యాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కూచ్, జెరెమీ హాన్సెన్ తమ శక్తివంత నికాన్ కెమెరాలు, ఐఫోన్లలో బంధించారు.ఈ ఫొటోలను నాసా విడుదలచేసింది. ఈ సందర్భంగా చంద్రుని అంచు వెనకాల భూమి అస్తమిస్తున్న ఫొటోనూ ఆర్టిమిస్-2 కమాండర్ రీడ్ వైస్‌మ్యాన్ తమ ఒరియాన్ ‘ఇంటిగ్రిటీ’క్యాప్సూల్ కిటికీ గుండా తీశారు. ఇదేకాకుండా వ్యోమగాములకు సూర్యునికి మధ్యలో చందమామ అడ్డుగా వచ్చి ఏర్పడిన అత్యంత అరుదైన సూర్యగ్రహం ఉద్విగ్నభరత క్షణాలను సైతం ఆస్ట్రోనాట్స్ తమ కెమెరాల్లో బంధించారు.



02

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

పేదలపై బీజేపీ సర్కార్‌ది కక్షపూరిత వైఖరి

ఉపాధి హామీ పని దినాలను సగానికి తగ్గించి పేదల పొట్ట కొడుతున్నారు

పేదల పొట్టే కొట్టేలా కేంద్రం వ్యవహరిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?

మోడీతో కొట్లాడి ఉపాధి హామీకి రావాల్సిన నిధులు తీసుకురావాలి ; కవిత



**ఈ కబురు, హైదరాబాద్ :**

ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల మీద కక్ష గట్టినట్లు వ్యవహరిస్తూ వారి నోటి కాడి కూడు లాగేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

02

# పాఠ్యాంశాలు నవీకరణ



టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం.. లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇది కొనసాగాలి. ఇళ్ల నిర్మాణంతోపాటు... ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలి. సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో.. ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నాం. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణ పేరుతో కానీ... ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. దీనిపై పటిష్ట నిఘా పెట్టాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కాలేజ్ కరిక్యులంను రీస్ట్రక్చర్ చేయాలి

"కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీఓరియేంటేషన్ చేయాల్సి ఉంది. ఈ మేరకు అధ్యయనం చేయండి. యూనివర్శిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలి. ట్రెడిషన్ కోర్సులతో పాటు... డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలి. ఈ మేరకు కరికుల్యంను రీస్ట్రక్చర్ చేసేలా చూడాలి. అలాగే యూనివర్శిటీల ర్యాంకింగులు కూడా మరింతగా పెరగాల్సి ఉంది. విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీతోపాటు... మిగిలిన యూనివర్శిటీలు కూడా ర్యాంకింగులను మరింతగా పెంచుకోవాల్సి ఉంది. ఇదే సందర్భంగా హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలి. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు కృషి చేయాలి. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు కానీ... విమర్శలు కానీ రాకూడదు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలి. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజల్లో, యువతలో ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కల్పించేలా శాప్ చర్యలు చేపట్టేలా శాప్ చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు.. మరణాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నివారించాలి. కఠినంగా నిబంధనలు అమలు చేయడానికంటే ముందు... ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. హెల్మెట్ వల్ల ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలి. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేదు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

-పిడుగుపాటుపై మరింత అప్రమత్తత అవసరం

'పిడుగు పాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదనే ముందస్తుగా అలెర్ట్ మెసేజ్‌లు పంపిస్తున్నాం... అయినా అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నాయి. టెక్నాలజీని వినియోగిస్తున్నాం... కానీ ప్రజల్లో దానిపై అవగాహన కలిగించేలా చేయకుంటే ఏం ఉపయోగం...? ఫోన్లల్లో మెసేజీలు పెట్టడమే కాదు... క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బందినీ అలెర్ట్ చేయాలి. అలాగే ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్ వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాలి' అని సీఎం ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్ 2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హైడ్రా భారీ ఆపరేషన్



రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబర్ 55లోని 8 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఐటీ హబ్‌కి చేరువలో బడా రియల్ ఎస్టేట్ సంస్థల స్వాధీనంలో ఉన్న 4.20 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు.. కొలను మాధవరెడ్డి కూతురు సబితకు చెందిన 4 ఎకరాల భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఇందులో తాత్కాలికంగా వేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది. ప్రభుత్వ భూమిలో నెలకొల్పిన ఆర్‌సీసీ ప్లాంట్‌ను వాసవి నిర్మాణ సంస్థ స్వయంగా తొలగించుకుంది. కార్మికులకోసం వేసిన తాత్కాలిక షెడ్డులను హైడ్రా తొలగించింది. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా తొలగించి బోర్డులు ఏర్పాటు చేసింది. మంగళవారం హైడ్రా కాపాడిన భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ. 1200ల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. గతంలోనూ ఇక్కడ ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సర్వే నంబరు 53లోని మొండికుంట ఆక్రమణలతో పాటు.. సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమిని 11 ఎకరాల వరకూ స్వాధీనం చేసుకున్న విషయం విధితమే.

--అసైన్డ్ భూముల పేరుతో..

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్లోని సర్వే నంబర్ 55 లో ఉన్న భూమి అసైన్డ్ ల్యాండ్. రంగారెడ్డి కలెక్టర్ ఈ భూమిని ప్రోహిబిటెడ్ లిస్టులో ఇప్పటికే పెట్టారు. దీని ప్రకారం ప్రభుత్వానికి చెందినదిగా పేర్కొన్నారు. అదే భూమిని తమదిగా మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ చెబుతూ వస్తోంది. వాసవి నిర్మాణ సంస్థ అందులో ఆర్‌సీసీ ప్లాంటులతో పాటు.. భవన నిర్మాణ కార్మికులకు షెడ్డులు వేసింది. అలాగే నిర్మాణ సామగ్రిని కూడా అందులో ఉంచింది. ఇలా వినియోగించుకుంటూ మొత్తం 4.20 ఎకరాల భూమిని తన స్వాధీనంలో ఉంచుకుంది. ఈ రెండు సంస్థలకు తోడు ఇదే సర్వే నంబరులో ఉన్న మరో 4 ఎకరాల భూమిని కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబిత తనదిగా చెబుతూ వస్తున్నారు. బౌన్సర్లను కాపలాగా ఉంచారు. హైడ్రాకు ఫిర్యాదు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలమేరకు క్షేత్రస్థాయిలో సబంధిత శాఖల అదికారులతో కలిసి హైడ్రా విచారించింది. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలమేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.

# మేం చేస్తున్నదే చెబుతున్నాం..

"కేరళలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించింది. దానిని మేం అభినందిస్తున్నాం. ఈ వ్యవస్థ విజయం ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది. మూడింట రెండొంతుల మెజారిటీతో మేం కేరళలో గెలవబోతున్నాం. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తాం. తెలంగాణలో మాదిరే అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం వంటివి కేరళలో అమలు చేస్తాం. పినరయి విజయన్‌తోపాటు కేరళ కమ్యూనిస్టు మహిళా నాయకులను నేను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు మేం చేస్తాం. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి.. మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చు. ఎన్నికలు కేరళ, తెలంగాణ మధ్య కాదు.. యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయి. విజయన్ నాకు రాసిన లేఖలో 201423 మధ్య విషయాలను ప్రస్తావించారు. ఆ కాలంలో పినరయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కేసీఆర్ హయాంలో తప్పులు జరిగినందునే.. తెలంగాణ ప్రజలు ఆయనను మార్చివేశారు. ఇప్పుడు విజయన్‌ను కేరళ ప్రజలు మార్చివేస్తారు. నరేంద్ర మోదీ.. విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# మీ నాగరికతను.. ఒక్కరాత్రిలో నాశనం చేస్తా

అమెరికా దాడుల నుంచి విద్యుత్కేంద్రాలను కాపాడుకునేందుకు మానవహారాలుగా ఏర్పడాలని తమ దేశ ప్రజలకు పిలుపునిచ్చింది. గల్ఫ్‌లోని అమెరికా మిత్రదేశాలపై దాడులను మరింత ఉద్ధృతం చేస్తామనీ హెచ్చరించింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని యావత్ ప్రపంచం ఊపిరి బిగపట్టి చూస్తోంది. దౌత్య ప్రయత్నాలతో చివరి నిమిషాల్లోనైనా అమెరికా, ఇరాన్‌లను ఒప్పించి యుద్ధాన్ని నిలిపివేయించాలని మధ్యవర్తులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇరాన్‌పై అణ్వస్త్రాలను ఉపయోగించబోమని శ్వేతసౌధం స్పష్టం చేసింది. మరోవైపు మున్ముందు చేయబోయే విధ్వంసక దాడులకు ట్రైలర్‌లా ఇరాన్‌కు చెందిన కీలక ఖర్గ్ దీవిపై అమెరికా మంగళవారం విరుచుకుపడింది. ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లో వంతెనలు, రైల్వే నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసింది.

--ఒప్పందం కుదరకపోతే..: ట్రంప్

హార్మూజ్‌ను పూర్తిగా తెరిచి తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్‌కు ట్రంప్ సూచించారు. "ఒప్పందం కుదరకపోతే ఈ రాత్రి (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి) ఓ నాగరికత మొత్తం నశిస్తుంది. దాన్ని వెనక్కి తీసుకురావడం ఇంకెప్పటికీ సాధ్యం కాదు. అలా జరగాలని నేను కోరుకోవటం లేదు. కానీ అదే జరిగేలా ఉంది. తెలివైన, తీవ్రవాద భావజాలం అంతగా లేని వ్యక్తులతో ప్రభుత్వ మార్పిడి జరుగుతుందేమో! ప్రపంచ చరిత్రలో అత్యంత కీలకమైన ఘట్టాన్ని ఈ రాత్రికి చూస్తామేమో! ఇరాన్‌కు ఇప్పటికీ సమయం మిగిలే ఉంది" అని మంగళవారం సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

--పోరాటానికి సిద్ధం: పెజెష్కియాన్

45 రోజుల కాల్పుల విరమణకు పాకిస్థాన్, ఈజిప్టు, తుర్కియే మధ్యవర్తులు చేసిన ప్రతిపాదనను ఇప్పటికే తిరస్కరించిన ఇరాన్.. అమెరికా దాడులను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. విద్యుత్కేంద్రాల చుట్టూ మానవహారాలుగా ఏర్పడాలని ప్రజలకు ఇరాన్ ఉన్నతాధికారి అలీరెజా రహీమీ ఓ వీడియో సందేశంలో పిలుపునిచ్చారు. గతంలో పశ్చిమ దేశాలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు అణు కేంద్రాల చుట్టూ ఇరానియన్లు మానవహారాలుగా ఏర్పడిన ఉదంతాలున్నాయి. మరోవైపు తనతో సహా 1.4కోట్ల మంది ఇరానియన్లు పోరాడటానికి సిద్ధంగా ఉన్నారని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. చెక్‌పాయింట్ల వద్ద విధుల నిర్వహణకు పిల్లల్ని పంపించాలని తల్లిదండ్రులను ఐఆర్‌జీసీ జనరల్ ఒకరు కోరారు.

ఇరాన్‌లో 33 మంది మృత్యువాత

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు మంగళవారం కూడా కొనసాగాయి. ఖర్గ్ దీవిలోని సైనిక లక్ష్యాలపై తాము బాంబుల వర్షం కురిపించినట్లు వాషింగ్టన్ తెలిపింది. అక్కడి చమురు మౌలిక వసతులపై మాత్రం దాడి చేయలేదని స్పష్టం చేసింది. ఇరాన్‌లోని టెహ్రాన్, కరాజ్, తబ్రిజ్, కషన్, కోమ్‌లలో వంతెనలపై ఇజ్రాయెల్ దాడి చేసింది.

టెహ్రాన్‌కు వాయవ్యాన అల్బోర్జ్ ప్రావిన్సులో జరిగిన దాడిలో 18 మంది మృత్యువాతపడ్డారు. ఇరాన్‌వ్యాప్తంగా జరిగిన ఇతర దాడుల్లో మరో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజా దాడులతో తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. గల్ఫ్‌వ్యాప్తంగా దాడులను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించింది. ఇజ్రాయెల్, సౌదీలపై దాడులను ఇరాన్ కొనసాగించింది. సౌదీపైకి టెహ్రాన్ 7 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వాటిని ఆ దేశ బలగాలు అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో అరేబియా ద్వీపకల్పానికి, బహ్రెయిన్‌కు మధ్య ఏకైక రోడ్డు అనుసంధానతగా ఉన్న కింగ్ ఫాహత్ కాస్‌వే వంతెనను సౌదీ తాత్కాలికంగా మూసివేసింది. ట్రంప్ డెడ్‌లైన్ సమీపించిన వేళ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. ఇరాన్ ఒప్పందానికి రాకపోతే ఇప్పటివరకూ వాడని తమ 'టూల్‌కిట్'లోని కొన్ని సాధనాలను ఇక ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇరాన్‌పై అణ్వస్త్రాలను ఉపయోగించే ప్రతిపాదనలేవీ లేవని శ్వేతసౌధం స్పష్టం చేసింది.

హార్మూజ్‌పై వీటోతో వీగిన ఐరాస తీర్మానం

హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించాలని ఐరాస భద్రతామండలి చేసిన తీర్మానాన్ని రష్యా, చైనా మంగళవారం వీటో చేశాయి. జోర్డాన్ మద్దతుతో బహ్రెయిన్ ప్రతిపాదించిన తీర్మానానికి అనుకూలంగా మండలిలోని 15 దేశాల్లో 11 దేశాలు ఓటువేయగా, రెండు వ్యతిరేకించాయి. మిగిలిన రెండూ ఓటింగులో పాల్గొనలేదు. వీటో అధికారమున్న శాశ్వత దేశాలు ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఇది ఆమోదం పొందలేదు. తీర్మానానికి భారత్ మద్దతు పలికింది. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తానంటూ ట్రంప్ హెచ్చరికను ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఖండించారు.

-కాలమే అంతం చేయలేకపోయింది ;'ఎక్స్'లో తుర్కియేలోని ఇరాన్ రాయబార కార్యాలయం

అలెగ్జాండర్ అగ్నికి ఆహుతిచ్చాడు. మంగోలియన్లు ధ్వంసం చేశారు. చరిత్ర ఎన్నో పరీక్షలు పెట్టింది. అయినా ఇరాన్‌కు ఏం కాలేదు. కాలమే అంతం చేయలేకపోయినదాన్ని ఒక ఉన్మాది హెచ్చరికలు ఏం చేయగలవు?

దౌత్య యత్నాలు ముమ్మరం!

ట్రంప్ విధించిన డెడ్‌లైన్‌లోపే అమెరికాఇరాన్ మధ్య రాజీ కుదిర్చేందుకు తాము ముమ్మరంగా కృషి చేస్తున్నామని దౌత్య ప్రయత్నాలు చేస్తున్న అధికారులు పేర్కొన్నారు. చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లో పౌర, ఇంధన మౌలిక వసతులను ధ్వంసం చేస్తామన్న ట్రంప్ హెచ్చరికపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్‌నోయెల్ బారట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై దాడులు యుద్ధ నియమాలు, అంతర్జాతీయ చట్టాల ప్రకారం నిషేధమని గుర్తు చేశారు.



## లాక్కోవడం..కూల్చడమే రేవంత్ సర్కారు లక్ష్యం



శంషాబాద్ ఠాణాకు తరలించారు. అక్కడే రెండు గంటల పాటు నిర్బంధించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. "వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ గద్దెనెక్కిన రేవంత్ సర్కార్.. 900 రోజులు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయలేదు. నిరుద్యోగులు, రైతులు, ప్రజలు.. ఇలా ఎవరి ఆకాంక్షలనూ ఈ ప్రభుత్వం నెరవేర్చలేదు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా.. కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కు పరిమితమవడం ఖాయం' అని పేర్కొన్నారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ రోడ్లు, మూసీ రివర్ ఫ్రంట్ అంటూ ప్రభుత్వం పేదలకు చెందిన వేల ఎకరాల భూములను లాక్కోవడం బాధాకరమన్నారు. బాధితులకు భరోసా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

-అక్రమాలు బయటకు రాకూడదనే అరెస్టులు: దాసోజు శ్రవణ్

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, ప్రజా సమస్యలు, అక్రమాలు బయటకు రాకూడదనే ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయిస్తోందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి కొత్వాల్‌గూడ, మానసహిల్స్, వట్టి నాగులపల్లి, నాదర్‌గుల్ ప్రాంతాల్లో రూ.వేల కోట్ల విలువైన భూదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, భూ దోపిడీని అడ్డుకునేందుకు వెళ్తున్న నేతలను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.

# తొలిసారిగా భూ అస్తమయం!

ఈ ఫొటోలను నాసా విడుదలచేసింది. ఈ సందర్భంగా చంద్రుని అంచు వెనకాల భూమి అస్తమిస్తున్న ఫొటోనూ ఆర్టిమిస్-2 కమాండర్ రీడ్ వైస్మ్యాన్ తమ ఒరియాన్ 'ఇంటిగ్రిటీ'క్యాప్సూల్ కిటికీ గుండా తీశారు. ఇదేకాకుండా వ్యోమగాములకు సూర్యునికి మధ్యలో చందమామ అడ్డుగా వచ్చి ఏర్పడిన అత్యంత అరుదైన సూర్యగ్రహం ఉదిప్వగ్నభరత క్షణాలను సైతం ఆస్ట్రోనాట్స్ తమ కెమెరాల్లో బంధించారు. ఈ చిమ్మచీకట్లో వెనక వైపు నుంచి మెరుస్తూ కన్పించిన బుధుడు, శుక్రుడు, అంగారకుడు, శనిగ్రహాల ఫొటోలనూ తీశారు. అర్ధ శతాబ్దం క్రితం అపోలో 12, అపోలో 14 మిషన్‌లో భాగంగా దిగ్గజ వ్యోమగాములు చంద్రునిపై దిగిన ల్యాండింగ్‌సైట్‌లనూ వ్యోమగాములు పరిశీలించారు.

ఈ సందర్భంగా గతేడాది మరణించిన అపోలో-8 మిషన్‌లో భాగస్వామి, మాజీ వ్యోమగామి జిమ్ లావెల్‌తో గతంలో రికార్డ్‌చేయించిన సందేశాన్ని వ్యోమగాములకు నాసా పంపించింది. "చరిత్రాత్మక రోజు ఇది. ప్రయోగాలు చేస్తూ బిజీగా ఉంటారేమో. అయినాసరే అక్కడి నుంచి అందాలను వీక్షించడం మానకండి"అని ఆయన సందేశం ఇచ్చారు. ఆ తర్వాత చంద్రుని ఆవలివైపు తొలిసారిగా తాము చూసిన ఒక బిలానికి ఇటీవల కన్నుమూసిన తోటి వ్యోమగామి వైస్మ్యాన్ భార్య కరోల్ పేరును పెట్టారు. ఈ సందర్భంగా నలుగురు వ్యోమగాములు కంటతడి పెట్టుకున్నారు.



# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర


మంగళవారం ఈ మేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి పని దినాలు తగ్గించటం, నిధులు ఇవ్వకపోవటంపై మోడీ సర్కార్‌ను గట్టిగా నిలదీస్తూ వీడియో సందేశం రిలీజ్ చేశారు. పేదలకు మేలు చేసే ఉద్దేశంతో తెచ్చుకున్న ఉపాధి హామీ పథకాన్ని పథకం ప్రకారం తొలగించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి చట్టబద్ధత లేకుండా చేశారని మండిపడ్డారు. చట్టబద్ధత ఉంటే నిధులు ఇవ్వడం తప్పనిసరి అవుతుందని కానీ ఈ పథకాన్ని ఒక ప్రొగ్రామ్ గా మార్చేసి నిధులు ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. భవిష్యత్ లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిన కూడా అడిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

--పని దినాలు సగానికి తగ్గింపు

ఉపాధి హామీ పథకం వచ్చిన తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంతో కొంత మెరుగుపడిందని కవిత చెప్పారు. అలాంటి ఈ పథకం పని దినాలను తగ్గించటం, నిధులు ఇవ్వకుండా చేయటం ద్వారా గ్రామాల్లో పేదల కడుపు కొడుతున్నారన్నారు. తెలంగాణలో కొవిడ్ తర్వాత 202122 లో 14 కోట్ల పని దినాలు ఉంటే గతేడాది 7 కోట్లకు పని దినాలను తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఉపాధి హామీలో పని దినాలు కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రతతో, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

-బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?

తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే... వారు ప్రజల కోసం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పేద ప్రజల నోటికాడి కూడు లాగేస్తుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అన్యాయమన్నారు. తక్షణమే కేంద్రంలోని వారి ప్రభుత్వంతో కొట్లాడి ఉపాధి హామీకి రావాల్సిన నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కరువు కాలంలో గ్రామాల్లో



పేదలను ఆదుకున్న ఈ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం



ఈ కబురు, అమరావతి :
'జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అనంతరం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది.

గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు

ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమస్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యం**

ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకంలో నీటి పొదుపు చర్యలు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానం.

100 రోజుల ప్రణాళికకు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడ్డుకోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుంది. జీవితాన్ని, ప్రకృతిని సమతుల్యం చేసుకుంటేనే భవిష్యత్తు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రకృతి ఇచ్చిన నీటి వనరులను ఉపయోగించుకోవడంలో జాగ్రత్త వహించాలి" అన్నారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ , కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు , అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా



ఈ కబురు : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం. "పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని అమిత్ షా పేర్కొన్నారు. "కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసనకారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు" అని పేర్కొన్నారు.

# 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తాం: ఉత్తమ్



ఈ కబురు, హుజూర్‌నగర్ :
రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 148 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తోందని, అందులో 90 లక్షల టన్నులు సేకరించేందుకు 8,251 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని మార్కెట్ యార్డులో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. '16 కోట్లకు పైగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాం. సన్నరకాలకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తాం. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై పూర్తి నిఘా పెట్టాం. గత సీజన్‌లో 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రైతులు విక్రయించిన 48 గంటల్లో చెల్లింపులు కూడా చేశాం. కొనుగోలు, రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. అన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వేగవంతం చేయాలి. నాణ్యత ప్రమాణాల విషయంలో కొన్ని ఇబ్బందులను కొందరు మిల్లర్లు తన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను మిల్లర్లు, కేంద్ర ఆహార మంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తాం' అని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రాధికా దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక చర్చల్లేవ్..!



ఈ కబురు : హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు ముగుస్తున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాతో జరుగుతున్న శాంతి చర్చలకు ద్వారాలు మూసేసింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వరంగ మీడియా సంస్థ టెహ్రాన్ టైమ్స్ వెల్లడించింది. "అమెరికాతో ఉన్న అన్ని దౌత్య, పరోక్ష సంభాషణ మార్గాలను ఇరాన్ మూసివేసింది. ఇరు దేశాల మధ్య సందేశాల మార్పిడిని కూడా నిలిపివేసింది" అంటూ టెహ్రాన్ టైమ్స్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. ట్రంప్ ఇచ్చిన గడువు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటలు) ముగియనుంది. అప్పట్లోగా హర్మూజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను నేలమట్టం చేస్తామని ట్రంప్ ఇది వరకే హెచ్చరించారు. తాజాగా ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా.. అమెరికా, దాని మిత్రదేశాలు కూడా తమ దెబ్బ రుచి చూస్తాయని ఇరాన్ పేర్కొంది. ఈ క్రమంలోనే ఈజిప్టు, పాకిస్థాన్, తుర్కియే మధ్యవర్తిత్వంలో ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలకు ముగింపు పలికింది. శాంతి చర్చల్లో భాగంగా 45 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన తీసుకురాగా ఇప్పటికే ఇరాన్ తిరస్కరించిన విషయం తెలిసిందే.

# ఆర్మీ చేతికి కాముకాజి ఆయుధం



ఈ కబురు : భారత సైన్యం అమ్ములపొదిలో మరో అధునాతన ఆయుధం చేరింది. ఆధునిక సాంకేతిక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించే ఆత్మాహుతి డ్రోన్లు (కాముకాజి) ఆర్మీ చేతికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రకానికి చెందిన వందలాది డ్రోన్లను స్వదేశీ సంస్థ తాజాగా సైన్యానికి అప్పగించినట్లు సమాచారం. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రూ.10 కోట్ల ఒప్పందంలో భాగంగా వీటిని అందజేసినట్లు తెలిసింది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఘటన నేపథ్యంలో.. సరిహద్దుల రక్షణ విషయంలో భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు వీలుగా ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకుంటోంది. ఈ క్రమంలోనే గతేడాది డిసెంబరులో కేంద్ర రక్షణశాఖ పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులోభాగంగానే తాజాగా గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' అనే సంస్థ వందలాది ఆత్మాహుతి డ్రోన్లను ఆర్మీ నార్తర్న్ కమాండ్‌కు డెలివరీ చేసినట్లు సమాచారం. అయితే, భద్రతా కారణాల రీత్యా ఎన్ని డ్రోన్లను అప్పగించారన్న దానిపై కచ్చితమైన సమాచారం బయటకు రాలేదు. కేవలం రెండు నెలల్లోనే ఈ డ్రోన్లను డెలివరీ చేయడం విశేషం. అత్యవసర కొనుగోలు కింద సైన్యం వీటిని తీసుకున్నట్లు తెలుస్తోంది.

--ఏంటీ ఆత్మాహుతి డ్రోన్ల ప్రత్యేకతలు..?

ఇవి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఏఐ ఆధారిత గైడెన్స్‌తో కచ్చితమైన దాడులతో లక్ష్యాలను ఛేదిస్తాయి. గరిష్ఠంగా 2.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగరగలవు. 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై దాడులు చేస్తాయి. 2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను ఈ డ్రోన్లు మోసుకెళ్లగలవు.అత్యవసర ముప్పులను వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం వీటి సొంతం. శత్రు భూభాగాల్లోకి చొచ్చుకెళ్లి లక్ష్యాలను ఛేదిస్తాయి.సాధారణ దళాలు వెళ్లలేని ప్రాంతాల్లోకి వెళ్లి దాడులు చేయగలవు. జీపీఎస్ అందుబాటులో లేని ప్రాంతాల్లోనూ ఉపయోగించేలా వీటిని రూపొందించారు.కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోగలవు. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఈ డ్రోన్లు పనిచేయగలవు.

# శబరిమలలో మహిళలపై ఆంక్షలు సబబే



ఈ కబురు, ఢిల్లీ:
అయ్యప్ప స్వామి కొలువైన శబరిమల ఆలయంలో 1050ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్థించింది. మత విశ్వాసం, మతపరమైన స్వయంప్రతిపత్తి పరిధిలోకి వచ్చే ఈ అంశాలు న్యాయ సమీక్షకు అతీతమైనవని పేర్కొంది. ప్రార్థనా స్థలాలు, మతపరమైన కేంద్రాల్లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందంటూ దాఖలైన పిటిషన్లపై 9 మంది జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణను ప్రారంభించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి సభ్యులుగా ఉన్నారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ కేసు విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది. పౌరులు అందరికీ మత స్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగంలోని 25వ అధికరణను ప్రస్తావిస్తూ... శాంతి భద్రతలకు, ప్రజారోగ్యానికి, నైతికతకు మత ఆచారాలు భంగం కలిగిస్తున్నట్లయితే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని తుషార్ మెహతా పేర్కొన్నారు. 'సామాజిక రుగ్మతకు మతాచారమనే ముద్రవేస్తే అది తప్పనిసరి మతాచారమా? సామాజిక రుగ్మతా? అనే విషయాన్ని న్యాయస్థానాలు పరిశీలించవచ్చు' అని ధర్మాసనం తెలిపింది. 'అది అశాస్త్రీయమైనది అయితే శాసనం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంటుంద'ని మెహతా బదులిచ్చారు.

--అంటరానితనం తగునా?

1050ఏళ్ల వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశ నిరాకరణను అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా అభివర్ణించిన 2018నాటి సుప్రీంకోర్టు తీర్పు పట్ల తనకు తీవ్ర అభ్యంతరం ఉందని తుషార్ మెహతా తెలిపారు. దీనిపై జస్టిస్ బి.వి.నాగరత్న స్పందిస్తూ...ఒక నెలలో మహిళలకు మూడు రోజులు అంటరానితనం ఉండి, నాలుగో రోజు అంటరానితనం ఉండదని అనుకోవడానికి వీల్లేదని వ్యాఖ్యానించారు. అంటరానితనాన్ని అధిగమించడానికే అధికరణం 17ను ప్రాథమిక హక్కుగా చేర్చారన్నారు. తాను రుతుక్రమ సమస్య గురించి మాట్లాడటం లేదని తుషార్ మెహతా తెలిపారు. శబరిమల ఆలయ ప్రవేశంపై ఆంక్షలు రుతుక్రమానికి సంబంధించినది కాదని, వయసు పరిమితికి సంబంధించినవేనని పేర్కొన్నారు.'ఒక్క శబరిమల ఆలయంలో మినహా.... దేశంలోని అయ్యప్ప స్వామి ఆలయాలు అన్నింటిలోనూ అన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉంటుంది. ఇది ఒక విలక్షణమైన కేసు' అని మెహతా తెలిపారు. 'విశ్వాసం, ఆచరణకు సంబంధించిన అంశం. ఏది అవసరం, ఏది అవసరం లేదో తేల్చాలంటే మత గ్రంథాలను అవగాహన చేసుకోవాలి. సమీక్షించాలి. అది సక్రమంగా జరగాలంటే అంతటి ఆధ్యాత్మిక స్థాయిని కలిగి ఉండాలి' అని అన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు అత్యున్నత స్థానాన్నే కల్పించారని చెప్పారు. పితృస్వామ్యం, ఫెమినిజం తదితర దిగుమతి చేసుకున్న సిద్ధాంతాల కోణంలో చూడవద్దని సూచించారు.

--ఇదీ నేపథ్యం...

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 1050 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని 2018లో ఐదుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం రద్దు చేసింది. ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలు కాగా 9 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది.




## నాలుగో రోజూ లాభాల్లో సూచీలు.. 23వేల ఎగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (Stock market) వరుసగా నాలుగోరోజు లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో ఉదయం ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోయింది. మధ్యాహ్నం తర్వాత సీన్ మారింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్ సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది.
సెన్సెక్స్ ఉదయం 73,734.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,106.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,282.41 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత పుంజుకొని 509.73 పాయింట్ల లాభంతో 74,616.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 155.40 పాయింట్ల లాభంతో 23,123.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్స్ లాభపడ్డాయి. ఇండిగో, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ట్రెంట్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి.
అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4663 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ రాణించాయి. యూరోపియన్ మార్కెట్‌లు కూడా లాభాల్లో ప్రారంభమయ్యాయి.

## 350 సీసీ ఇంజిన్‌తో ట్రయంఫ్ బైక్స్.. మోడల్స్, ధరల వివరాలు ఇవీ..



బ్రిటీష్ మోటార్ సైకిల్ కంపెనీ ట్రయంఫ్ (Triumph) భారత్‌లో తన వాహన ఫోర్ట్‌ఫోలియోను అప్‌డేట్ చేసింది. గతంలో 400 సీసీ ఇంజిన్‌తో పలు మోడళ్లను లాంచ్ చేసిన ఆ కంపెనీ.. తాజాగా 350 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో కొత్త మోటార్ సైకిళ్లను లాంచ్ చేసింది. 350సీసీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన మోటార్ సైకిళ్లపై తక్కువ జీఎస్టీ పడుతుండడంతో ఆ మేర ఇంజిన్ సామర్థ్యాన్ని తగ్గిస్తూ స్పీడ్ 400, స్పీడ్ టీ4, థ్రక్స్టన్ 400, స్క్రాంబ్లర్ 400, స్క్రాంబ్లర్ 400XC మోడళ్లను లాంచ్ చేసింది. ఇంజిన్ సామర్థ్యాన్ని తగ్గించినప్పటికీ అదే పేరును కొనసాగించింది. గతంతో పోలిస్తే కొన్నింటి ధరలను తగ్గించగా.. మరికొన్నింటి ధరలు పెరిగాయి.

ట్రయంఫ్ స్పీడ్ టీ4: గతంలో 398 సీసీ సామర్థ్యంతో తీసుకొచ్చిన స్పీడ్ టీ4ను ఈసారి 349 సీసీ సామర్థ్యంతో విడుదల చేశారు. ధర మాత్రం రూ.1.95 లక్షలుగా నిర్ణయించారు. ధరలో ఎలాంటి మార్పూ చేయలేదు.

ట్రయంఫ్ స్పీడ్ 400: ట్రయంఫ్ స్పీడ్ 400 మోడల్ ధరను గతంతో పోలిస్తే రూ.7 వేలు తగ్గించి రూ.2.31 లక్షలుగా నిర్ణయించారు. గత ఇంజిన్ 40 హెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేయగా.. కొత్త బైక్ 37 హెచ్‌పీని ఉత్పత్తి చేస్తుంది.

ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400: ఈ మోడల్‌పై గతంతో పోలిస్తే ధరను రూ.10,736 మేర తగ్గించారు. 349 సీసీ ఇంజిన్, 37 హెచ్‌పీ పవర్‌తో తీసుకొచ్చారు.

ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400 XC: కొత్త స్క్రాంబ్లర్ 400 XC ధర రూ.2.98 లక్షలుగా నిర్ణయించారు. గతంతో పోలిస్తే ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,793 మేర పెరిగింది. డిజైన్‌లో పెద్దగా మార్పులు చేయలేదు.

ట్రయంఫ్ థ్రక్స్టన్ 400: కొత్త థ్రక్స్టన్ 400ను రూ.2.65 లక్షల వద్ద లాంచ్ చేశారు. గత మోడల్‌తో పోలిస్తే ధరను రూ.11వేలు తగ్గించారు. ఇందులోని 349 సీసీ ఇంజిన్ 40 హెచ్‌పీ పవర్‌ను, 32 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. గతంలో 42 హెచ్‌పీ, 37.5 ఎన్ఎంగా ఉండేది.

# కొవిడ్ తరహా ప్యాకేజీ..

## వారికి ₹2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్!



దిల్లీ: పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రభావితమైన రంగాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వ్యాపారాలను, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు రూ.2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ స్కీమ్ కింద బ్యాంకులు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం హామీగా ఉంటుంది. ఒకవేళ వ్యాపారాలు నష్టపోయి అప్పు తీర్చలేని పరిస్థితి వస్తే.. ప్రభుత్వం 90 శాతం (గరిష్ఠంగా రూ.100 కోట్ల వరకు) గ్యారెంటీ ఇస్తుంది. ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ (NCGTC) నుంచి ఈ గ్యారెంటీ లభిస్తుంది. ప్రభుత్వం రూ.17వేల నుంచి రూ.18 వేల కోట్లు మేర ఈ స్కీమ్ కింద వెచ్చించనుంది. కొవిడ్19 సమయంలో వివిధ రంగాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇదేరీతిన 2020లో ఓ ప్యాకేజీని ప్రకటించింది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎంఎస్ఎంఈలు, ఇతర వ్యాపారులను ఆదుకునేందుకు ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ (ECLGS)ను తీసుకొచ్చింది. దీనికింద అన్నిరంగాలకు 100 శాతం గ్యారెంటీతో రుణాలు అందించింది. ఈ పథకం కింద బ్యాంకులు లేదా ఆర్థికసంస్థలు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. అప్పు తీసుకున్నవారు తిరిగి చెల్లించలేకపోతే, ప్రభుత్వం ఆ బాధ్యతను తీసుకుంటుంది. పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు అందించింది. దేశ ఆర్థికవ్యవస్థపై యుద్ధ ప్రభావం పడకుండా ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. పెరిగిన చమురు ధరల ప్రభావం వినియోగదారుల మీద భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై రూ.10 మేర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. డీజిల్‌పై లీటరుకు రూ.21.50, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకం విధించింది. కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. తాజాగా యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇచ్చేందుకు త్వరలో ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించనుంది. యుద్ధ ప్రభావిత రంగాలను ఆదుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రకటించారు.

# ఎయిరిండియా సీఈఓ విల్సన్ రాజీనామా




టాటా గ్రూప్‌నకు చెందిన దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా (Air India) సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారు. మరో ఏడాది పదవీ కాలం ఉండగానే తన బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆయన రాజీనామాను ఎయిరిండియా ధ్రువీకరించింది. విల్సన్‌పై టాటా గ్రూప్ పెద్దలు అసంతృప్తిగా ఉన్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ 2022 జులైలో ఎయిరిండియాలో చేరారు. ఆయన పదవీకాలం 2027 జూన్‌తో ముగియనుంది. ఆయన నేతృత్వంలోనే ఎయిరిండియాలో విస్తారా విలీనమైంది. అయితే, సంస్థ సేవల్లో నాణ్యత, సమయపాలనలో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. దీనికితోడు గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాదంతో విల్సన్ నాయకత్వంపై వ్యతిరేకత మొదలైంది. ఆ సమయంలో ప్రభుత్వ అధికారులు కూడా విల్సన్‌ను పక్కనపెట్టి నేరుగా టాటా గ్రూప్ పెద్దలతో మాట్లాడటం చర్చకు దారితీసింది. దీంతో ఆయనకు కంపెనీ ఉద్వాసన పలకనున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.ఈ క్రమంలోనే ఎయిరిండియా సీఈవో పదవి కోసం టాటా గ్రూప్ కొత్త వ్యక్తిని అన్వేషిస్తున్నట్లు ఈ ఏడాది మార్చిలో కథనాలు వెలువడ్డాయి. అమెరికా, యూకేకు చెందిన రెండు ప్రముఖ విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడినట్లు వాటి సారాంశం. ఈనేపథ్యంలోనే తాజాగా విల్సన్ తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరోవైపు, ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ కూడా ఇటీవలే పదవి నుంచి దిగిపోయారు. ఇదే సరైన సమయం: విల్సన్

ఎయిరిండియాకు రాజీనామాపై విల్సన్ స్పందించారు. ఈ మేరకు ఉద్యోగులకు లేఖ రాశారు. ఎయిరిండియా తదుపరి దశ అభివృద్ధి కోసం బాధ్యతలను మరొకరికి అప్పగించడానికి ఇదే 'సరైన సమయం' అని ఆయన పేర్కొన్నారు. ఆరు నెలల పాటు ఆయన నోటీసు పీరియడ్‌లో ఉంటారు. మరోవైపు కొత్త సీఈవోను ఎంపిక చేసేందుకు ఎయిరిండియా ఇప్పటికే ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. కొత్త వ్యక్తి బాధ్యతలు స్వీకరించే వరకు విల్సన్ తన పదవిలో కొనసాగుతారు. నాలుగేళ్ల పాటు సంస్థకు సేవలందించిన విల్సన్‌కు టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కృతజ్ఞతలు తెలిపారు.

# రూ.2.5 లక్షల కోట్ల క్రెడిట్ గ్యారెంటీ పథకం సిద్ధం!

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ సరఫరా గొలుసులో అంతరాయాలు భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. ఈ సంక్షోభం వల్ల దెబ్బతిన్న వివిధ రంగాలను ఆదుకునేందుకు సుమారు రూ.2.5 లక్షల కోట్ల భారీ క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది. కొవిడ్ సమయంలో ఎంఎస్ఎంఈలను ఆదుకున్న 'ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్' (ఈసీఎల్‌జీఎస్) తరహాలోనే ఈ నూతన ప్యాకేజీ ఉండబోతోందని ఉన్నతాధికారులు వెల్లడించారు.

**వ్యాపారాలకు రక్షణ కవచం**

ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల లిక్విడిటీ (నగదు లభ్యత) సమస్యలను ఎదుర్కొంటున్న పరిశ్రమలకు ఈ పథకం ఊపిరి పోయనుంది. ఇందులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

ఈ పథకం కింద వ్యాపారాలు పొందే రుణాలకు నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ (ఎన్‌సీజీటీసీ) ద్వారా 90 శాతం క్రెడిట్ గ్యారెంటీ లభిస్తుంది. ఒకవేళ రుణగ్రహీత డిఫాల్ట్ అయితే ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

ఈ పథకం సుమారు నాలుగేళ్ల పాటు అమలులో ఉండే అవకాశం ఉంది.

వివిధ రంగాలు, ఉపరంగాలకు సుమారు రూ.100 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

గత అనుభవాల దృష్ట్యా రుణాలను చౌకగా అందించేందుకు బ్యాంకుల వడ్డీ రేటును 9.25 శాతం, ఎన్‌బీఎఫ్‌సీల వడ్డీ రేటును 14 శాతానికి పరిమితం చేసే అవకాశం ఉంది.

అసలు మొత్తం తిరిగి చెల్లింపుపై ఏడాది పాటు మారటోరియం లభిస్తుంది. అయితే, ఈ కాలంలో వడ్డీ మాత్రం చెల్లించాల్సి ఉంటుంది.

**విమానయాన, ఎంఎస్ఎంఈ రంగాలపై ప్రత్యేక దృష్టి**

ఇరాన్‌ఇజ్రాయెల్ ఉద్రిక్తతల కారణంగా విమాన మార్గాల మళ్లింపు, ఇంధన ధరల పెరుగుదల, నిర్వహణ ఖర్చులు పెరగడంతో విమానయాన రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ రంగానికి తక్షణ మద్దతు అవసరమని అధికారులు గుర్తించారు. 'ప్రస్తుతం లిక్విడిటీ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న విమానయానం, ఎంఎస్ఎంఈలు, ఇతర కీలక వ్యాపారాలకు అండగా నిలవడమే మా ప్రాధాన్యత. ఇరాన్ సంక్షోభం వల్ల విమానయాన కార్యకలాపాల్లో ఏర్పడిన అంతరాయాలను అధిగమించేందుకు మద్దతు అవసరం' అని ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి తెలిపారు.



## నా చావుకు మరో ఏడాది దగ్గరయ్యా.. ఆర్జీవీ ఆసక్తికర పోస్ట్



టాలీవుడ్ డైరెక్టర్ రాం గోపాల్ వర్మ స్టైలే వేరు. తనకంటూ ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసుకున్న కొద్దిమంది డైరెక్టర్లలో ఆర్జీవీ ఒకరు. ఆయన ఏం మాట్లాడినా సరే అందులో ఓ ప్రత్యేకమైన శైలి ఉంటుంది. రొటీన్‌కు భిన్నంగా తన పంచ్‌లతో ఆకట్టుకుంటారు. అలా టాలీవుడ్‌లో విలక్షణ దర్శకుడిగా రాం గోపాల్ వర్మ అభిమానుల గుండెల్లో స్థానం దక్కించుకున్నారు.

ఇవాళ ఆర్జీవీ మరో వసంతంలోకి అడుగుపెట్టారు. ఏప్రిల్ 7న రాం గోపాల్ వర్మ బర్త్ డే కావడంతో తనదైన స్టైల్లో మరో ట్వీట్ చేశారు. ఈ రోజు నేను నా చావుకు మరో ఏడాది దగ్గరయ్యానంటూ సెటైరికల్ పోస్ట్ చేశారు. అందువల్ల మీకు సంతోషం కలిగించే మరే ఇతర కారణాల కోసమైతే తప్ప.. ఈ రోజును వేడుకలా జరుపుకోవద్దు! ధన్యవాదాలు.. అంటూ రాసుకొచ్చారు. ఇది చూసిన కొందరు అభిమానులు ఆర్జీవీకి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్నారు.



## అల్లు అర్జున్ అట్లీ.. అప్‌డేట్ ఇదే..


అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'AA22xA6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. రేపు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది (AA 22 Title). ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ, 'AA 22' టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా (AA22xA6) థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు.పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతోపాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో దీపికా పదుకొణె పేరు ఇప్పటికే

## వ్యాపారవేత్తను పెళ్లి చేసుకున్నా.. పిల్లలు కూడా ఉన్నారు

స్టార్ హీరోయిన్ త్రిష పేరు ఇప్పుడు నెట్టింట ఎక్కువగా వినిపిస్తోంది. కోలీవుడ్ స్టార్, టీవీకే అధినేత విజయ్ భార్య విడాకుల పిటిషన్ దాఖలు చేయడంతో అనూహ్యంగా త్రిష పేరు తెరమీదకొచ్చింది. విజయ్‌తో త్రిష రిలేషన్‌తో ఉన్నట్లు రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇద్దరు కలిసి ఓ ఫంక్షన్‌కి హాజరవ్వడంతో.. ఈ పుకార్లు ఇంకా ఎక్కువైయ్యాయి. త్వరలో పెళ్లి చేసుకుంటారని..ఆమె సినిమాలకు గుడ్‌బై చెప్పి..రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ రకరకాల రూమర్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల నటుడు, దర్శకుడు చిత్రా లక్ష్మణన్ కూడా త్రిష ఇకపై నటించబోదని చెప్పడంతో మరోసారి త్రిషపై నెట్టింట చర్చ జరిగింది. దీనిపై త్రిష తనదైన శైలీలో స్పందించింది. చిత్రా లక్ష్మణ్ వాఖ్యలకు కౌంటర్‌గా 'అవును నేను సినిమాలు మానేసి, ఒక ధనవంతుడైన వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని, నిన్నటికి రెండేళ్లు నిండిన నలుగురు కవలలను పెంచుతున్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా? ఈ రోజు వార్తలు రాసుకోవడానికి ఇది సరిపోతుందా లేదా ఇంకా ఏదైనా జోడించమంటారా?' అని త్రిష ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చింది. ఈ పోస్ట్‌తో ఆమె సినిమాలు మానేసిందనేది పుకారు మాత్రమేనని తేలిపోయింది. త్రిష సినీ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం అమె 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు') చిత్రంలో సూర్యకు జంటగా నటిస్తోంది. తెలుగులో చిరంజీవి సరసన నటించిన విశ్వంభర రిలీజ్‌కు రెడీ అవుతుంది. దేవిధంగా మలయాళంలో మోహన్‌లాల్ కు జంటగా రామ్ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇవన్నీ గత ఏడాది, అంతకు ముందు ఏడాది అంగీకరించిన చిత్రాలు అన్నది గమనార్హం.



## మాజీ 'మిస్ ఇండియా ఎర్త్' అదృశ్యం




మిస్ ఇండియా ఎర్త్ 2019 విజేత సయాలీ సర్వే, ఆమె నలుగురు పిల్లలు అదృశ్యమయ్యారు. పుణెలోని పింప్రిచించ్వాడ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకున్న ఆమె.. ఇటీవలే తిరిగి హిందూమతంలోకి మారారు. హిందూమతంలోకి మారిన కొన్ని రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. భర్త, అత్తింటివారే సయాలీని కిడ్నాప్ చేశారంటూ ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సయాలీ సర్వే కొన్నేళ్లక్రితం ఇస్లాంలోకి మారి వివాహం చేసుకున్నారు. పెళ్లి అయిన తర్వాత తన పేరును అతీజాగా మార్చుకొన్నారు. వివాహం జరిగిన కొన్ని రోజులకే భర్త వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇటీవల తన నలుగురు పిల్లలతో కలిసి బయటకు వచ్చి హిందూమతంలోకి మారారు. తన పేరును కూడా ఆద్య సుర్వేగా మార్చుకున్నారు. ఇది జరిగిన కొన్ని రోజులకే వారు కిడ్నాప్ కావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై పింప్రిచించ్వాడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'రామాయణ'.. రావణుడిలో మరో కోణాన్ని చూపిస్తాం: నితీశ్ తివారీ

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న చిత్రం 'రామాయణ' (Ramayana). ఇందులో రాముడిగా రణ్‌బీర్, రావణుడిగా యశ్ (Yash) కనిపించనున్నారు. రావణుడి పాత్రపై తాజాగా దర్శకుడు (Nitesh Tiwari) ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆ పాత్రను నెగెటివ్ మాత్రమే చూపించడం లేదని స్పష్టంచేశారు. ఆయనలో ఉన్న ఇతర మంచి కోణాలను చూపించనున్నట్లు తెలిపారు. "రావణుడి జీవితంలో ఎన్నో ఆసక్తికర కోణాలు ఉన్నాయి. ఆయన గొప్ప వీరుడు మాత్రమే కాదు.. అద్భుతమైన సంగీత విద్వాంసుడు. మేధావి, ప్రజలను జాగ్రత్తగా చూసుకునే రాజు. అంతకుమించి గొప్ప శివ భక్తుడు. ఆయనను కేవలం నెగెటివ్ పాత్రలో చూపించడం మా ఉద్దేశం కాదు. ఆయనలో ఉన్న గొప్ప లక్షణాలను కూడా ప్రేక్షకులకు చూపిస్తాం. ఆయన జీవితం గొప్ప పాఠం. ఒక వ్యక్తిలో ఎన్ని గొప్ప లక్షణాలు ఉన్నప్పటికీ.. అతడు పగ, అహంకారాలతో ఉంటే చివరికి ఫలితం ఎలా ఉంటుందన్న పాఠాన్ని ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. ఆయన ఎందుకు అలా పతనమయ్యారో కూడా 'రామాయణ'లో (Ramayana) వివరిస్తాం. ఈ పాత్ర ద్వారా సమాజానికి ముఖ్యమైన సందేశాన్ని అందిస్తాం" అని నితీశ్ తివారీ తెలిపారు.భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఇప్పటికే మొదటిభాగం చిత్రీకరణ కూడా పూర్తయింది. ఇందులో సీతగా సాయిపల్లవి నటిస్తున్నారు. ఇటీవలే గ్లింప్స్‌తో రాముడి లుక్ రిలీజ్ చేశారు. రెండు భాగాలుగా ఇది రానుంది. మొత్తం నిడివి రెండు భాగాలు కలిపి సుమారు ఆరు గంటల వరకూ ఉంటుందని రణ్‌బీర్ (Ranbir Kapoor) ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి.. సెకండ్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానున్నాయి (Ramayana Release Date).




## ట్రెండింగ్‌లో 'వారణాసి'.. సాంగ్ ఎప్పుడన్న కార్తికేయ!



ప్రస్తుతం ఇండస్ట్రీ అంతా ఎదురుచూస్తోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌బాబు (Mahesh Babu) హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోంది. నేడు ఈ సినిమా పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి ఒక కారణం కీరవాణి పోస్ట్ అయితే.. మరొకటి ఈ సినిమా (Varanasi Release Date) వచ్చే ఏడాది ఇదే రోజున విడుదల కావడం. ఈ సినిమా సంగీత దర్శకుడు కీరవాణి ఈరోజు ఉదయం తన ఎక్స్‌లో '365' అని పోస్ట్ పెట్టారు. ఈ సినిమా రిలీజ్‌కు ఏడాది ఉంది అని పరోక్షంగా తెలిపారు. దీనికి రాజమౌళి కుమారుడు కార్తికేయ స్పందిస్తూ.. 'ఇది ఓకే.. కానీ, సాంగ్ ఎప్పుడు రిలీజ్ చేస్తారు?' అని రిప్లై పెట్టారు. ఈ రిప్లై కింద అభిమానులు కూడా సాంగ్ అప్‌డేట్ ఇవ్వాలంటూ వరుసగా కీరవాణిని ట్యాగ్ చేస్తున్నారు.2027 ఏప్రిల్ 7 విడుదలే లక్ష్యంగా చిత్రబృందం పనిచేస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా చిన్న విరామం తర్వాత కొత్త షెడ్యూల్ ప్రారంభించుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్‌లో మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్‌లపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 70 శాతం పూర్తయిందని సమాచారం. జూన్ నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని రాజమౌళి (SS Rajamouli) ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## విజయ్‌రష్మిక గ్రాండ్ రిసెప్షన్... కొడగు స్టైల్లో మెరిసిన జంట..!

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ రష్మిక ఈ ఏడాది పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. కొన్నేళ్ల పాటు సీక్రెట్ రిలేషన్‌లో ఉన్న వీరిద్దరు ఫిబ్రవరి 26న పెళ్లి చేసుకున్నారు. ఉదయ్‌పూర్ వేదికగా వీరిద్దరి గ్రాండ్ వెడ్డింగ్ జరిగింది. ఈ పెళ్లి వేడుకలోఅత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించారు. ఇటీవలే రష్మిక తన పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకుంది. విజయ్ దేవరకొండతో పెళ్లి తర్వాత తన తొలి బర్త్ డేను ఇరు కుటుంబాల సమక్షంలో జరుపుకుంది. రష్మిక పుట్టినరోజు సందర్భంగా కర్ణాటకలోని ఇగ్గుతప్ప ఆలయాన్ని కూడా సందర్శించారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.అయితే తాజాగా ఈ జంట మరోసారి రిసెప్షన్ వేడుక నిర్వహించారు. రష్మిక సొంత గ్రామం కూర్గ్‌లో కొడగు సంప్రదాయంలో రిసెప్షన్ జరుపుకున్నారు. ఈ ఫంక్షన్‌లో రష్మిక కొడగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసింది. ఈ రిసెప్షన్‌లో కూర్గి స్టైల్లో చీరను ధరించింది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ రష్మిక జంట స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను కొడగు రావడం ఇది మూడోసారని తెలిపారు. మొదటిసారి రష్మికను కలవక ముందే ఇక్కడకు వచ్చానని ఆయన గుర్తుచేసుకున్నారు. గతంలో ఒకసారి వచ్చినప్పుడు తన ఫ్రెండ్ ఇంట్లో ఉన్నానని విజయ్ దేవరకొండ వెల్లడించారు. అయితే తన ఫ్రెండ్ ఈ రిసెప్షన్‌కు హాజరు కాలేదని తెలిపారు. నా స్కూల్ టైమ్‌లో స్నేహితులతో కలిసి ఇక్కడికి వచ్చానని పంచుకున్నారు.చాలా అందంగా ఉంటారు..

తనకు కొడగు అందాలు అంటే చాలా ఇష్టమని.. ఇక్కడి మహిళలు కూడా అంతే అందంగా ఉంటారని కొనియాడారు. కూర్గ్ మహిళలు చాలా అందంగా ఉంటారని.. నేను కూర్గ్ అమ్మాయినే వివాహం చేసుకున్నానని విజయ్ దేవరకొండ కామెంట్స్ చేశారు. మిమ్మల్నందరినీ ఇక్కడ కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కొడగు రిసెప్షన్‌కు ఇరువురి కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. ఇక సినిమాల విషయానికొస్తే రష్మిక విజయ్ జంటహా 'రణబాలి' సినిమాలో నటిస్తున్నారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది.





# ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ అరెస్ట్

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ (David Warner) అరెస్టయ్యాడు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో సిడ్నీ పోలీసులు మంగళవారం అతడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆస్ట్రేలియా మీడియా కథనాలు వెల్లడించాయి.రోడ్డుపై బ్రీత్ టెస్టింగ్‌ను చూడగానే వార్నర్ తన వాహనాన్ని ఆపి పక్కనే పార్క్ చేశాడు. అనుమానం వచ్చిన అధికారులు బ్రీత్ అనలైజర్‌తో టెస్ట్ చేశారు. ఇందులో వార్నర్ పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలడంతో అరెస్టు (David Warner Arrest) చేసినట్లు సదరు కథనాలు తెలిపాయి. అనంతరం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి బెయిల్‌పై విడిచిపెట్టారు. ఈ కేసులో వార్నర్ వచ్చే నెల కోర్టు ఎదుట హాజరుకానున్నట్లు సమాచారం. కాగా.. వార్నర్ ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ లీగ్‌లో ఆడుతున్న సంగతి తెలిసిందే. కరాచీ కింగ్స్‌కు కెప్టెన్‌గా ఉన్న అతడు.. ఇటీవలే వ్యక్తిగత సెలవు తీసుకుని ఆస్ట్రేలియా తిరిగొచ్చాడు. ఈ లీగ్ కోసం త్వరలోనే మళ్లీ పాక్‌కు వెళ్లనున్నాడు.

# ముంబై ఇండియన్స్ ను చిత్తు చేసిన రాజస్తాన్



**ముంబై ఇండియన్స్‌పై రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయం**
**వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన మ్యాచ్**

గువాహటి: ఐపీఎల్ 19వ సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. గత రెండు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన రియాన్ పరాగ్ సారథ్యంలోని రాజస్తాన్ మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. భారీ వర్షం కారణంగా నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ నిర్ణీత 11 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (32 బంతుల్లో 77 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 39; 1 ఫోర్, 5 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. అనంతరం ముంబై తడబడింది. 11 ఓవర్లలో 9 వికెట్లకు 123 పరుగులు చేసి ఓడింది. రికెల్టన్ (8), రోహిత్ (5), సూర్యకుమార్ (6), తిలక్ (14), హార్దిక్ (9) విఫలమయ్యారు.

**దంచుడే... దంచుడు**

మ్యాచ్‌ను రాయల్స్ మెరుపులతో ఆరంభించింది. చహర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ 4, 6, 4, 4, 4 కొట్టడంతో 22 పరుగులు రాగా... బుమ్రా వేసిన మరుసటి ఓవర్‌లో వైభవ్ రెండు సిక్స్‌లు బాదాడు. బౌల్ట్ వేసిన మూడో ఓవర్‌లో జైస్వాల్ రెండు, వైభవ్ ఒక సిక్స్ కొట్టడంతో మరోసారి 22 పరుగులు వచ్చాయి. దీంతో 3 ఓవర్లు ముగిసేసరికి రాజస్తాన్ 58 పరుగులు చేసింది. 4వ ఓవర్‌లో హార్దిక్ నాలుగు పరుగులే ఇవ్వగా... శార్దుల్ వేసిన ఐదో ఓవర్‌లో 6, 4, 6 కొట్టిన వైభవ్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అవుటయ్యాడు. దీంతో 80 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ధ్రువ్ జురేల్ (2) విఫలం కాగా... కెప్టెన్ రియాన్ పరాగ్ (10 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఉన్నంతసేపు ధాటిగా

**స్కోరు వివరాలు**



రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 77; వైభవ్ (సి) తిలక్ (బి) శార్దుల్ 39; జురేల్ (ఎల్బీ) ఘజన్‌ఫర్ 2; పరాగ్ (సి) తిలక్ (బి) ఘజన్‌ఫర్ 20; హెట్‌మైర్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (11 ఓవర్లలో 3 వికెట్లకు) 150. వికెట్ల పతనం: 1-80, 2-84, 3-121. బౌలింగ్: దీపక్ చహర్ 1-0-22-0; బుమ్రా 3-0-32-0; బౌల్ట్ 1-0-22-0; హార్దిక్ 2-0-17-0; శార్దుల్ 2-0-36-1; ఘజన్‌ఫర్ 2-0-21-2.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) జురేల్ (బి) ఆర్చర్ 8; రోహిత్ (సి) జురేల్ (బి) సందీప్ 5; సూర్యకుమార్ (సి) ఆర్చర్ (బి) బర్గర్ 6; తిలక్ (సి) హెట్‌మైర్ (బి) బిష్ణోయ్ 14; హార్దిక్ (సి) జైస్వాల్ (బి) బిష్ణోయ్ 9; నమన్ (సి) బిష్ణోయ్ (బి) బర్గర్ 25; రూథర్‌ఫోర్డ్ (సి) సందీప్ (బి) దేశ్‌పాండే 25; శార్దుల్ (సి) జురేల్ (బి) సందీప్ 8; దీపక్ (నాటౌట్) 5; బౌల్ట్ (రనౌట్) 1; బుమ్రా (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (11 ఓవర్లలో 9 వికెట్లకు) 123. వికెట్ల పతనం: 1-10, 2-20, 3-22, 4-41, 5-46, 6-93, 7-103, 8-111, 9-116. బౌలింగ్: ఆర్చర్ 2-0-17-1; బర్గర్ 2-0-21-2; సందీప్ 3-0-26 -2; దేశ్‌పాండే 2-0-29-1; బిష్ణోయ్ 2-0-25-2.



# ఆ మూడుతో నింగికి... ఈ మూడుతో నేలకు
## ...మారని సంజు తీరు



''అతను గొప్ప ప్రతిభావంతుడే కానీ..'' సంజు శాంసన్ గురించి మాట్లాడేటపుడు చాలామంది విశ్లేషకులు ఈ 'కానీ' అనే పదం కచ్చితంగా ఉపయోగిస్తుంటారు. తన ప్రతిభకు పూర్తి న్యాయం చేయడని.. నిలకడగా ఆడలేడన్నది ఎప్పట్నుంచో ఉన్న విమర్శ. ఈసారి టీ20 ప్రపంచకప్‌లో తన ప్రదర్శన చూశాక అతను మారిపోయాడని.. ఇప్పుడు చూస్తున్నది సంజు 2.0 అని.. ఇకపై తన కెరీర్‌లో ఉత్థానమే తప్ప పతనం ఉండదని వ్యాఖ్యానాలు చేశారు తన అభిమానులు. కానీ తాను మారబోనని.. నిలకడ లేమి విషయంలో నిలకడ తప్పనని మరోసారి చాటుతున్నాడు. ఎంత ప్రతిభ ఉంటే ఏం లాభం? దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం.. నిలకడగా రాణించి జట్టుకు విలువ చేకూర్చడం ముఖ్యం. ప్రతిభ పరంగా చూస్తే సంజు శాంసన్.. దేశంలో ఏ మేటి క్రికెటర్‌కూ తీసిపోడు. కోహ్లి, రోహిత్ లాంటి అగ్రశ్రేణి బ్యాటర్లలో ఉండే క్లాస్ తనలోనూ చూడొచ్చు. సంజు బ్యాటింగ్‌లో సొగసే వేరు. అతను ఆడుతుంటే చూడబుద్ధేస్తుంది. అద్భుతమైన టైమింగ్‌లో షాట్లు ఆడతాడు. మేటి బౌలర్లను కూడా సమర్థంగా ఎదుర్కొంటాడు. చాలా కఠినమైన బంతులను కూడా అలవోకగా బౌండరీకి తరలిస్తాడు. కానీ ఇవన్నీ తనకు కలిసొచ్చిన రోజు మాత్రమే జరుగుతాయి. కానీ ఆ కలిసొచ్చే రోజులు ఎప్పుడో కానీ రావు. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో ఒక మూడు రోజులు మాత్రం అతడికి భలేగా కలిసొచ్చాయి. ఆ టోర్నీ ముంగిట వరుస వైఫల్యాలతో తీవ్రంగా నిరాశపరిచాడు సంజు. దీంతో తుది జట్టులో తనకు చోటు కూడా పోయింది. ఐతే రింకు సింగ్ జట్టును వీడడంతో అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. వెస్టిండీస్‌తో చివరి సూపర్ 8 మ్యాచ్ నుంచి చెలరేగాడు. వరుసగా 97 నాటౌట్, 89, 89 స్కోర్లతో టీమ్ ఇండియా ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు.

సంజు కెరీర్లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఇలా కీలక ఇన్నింగ్స్‌లు ఆడడం ఇదే తొలిసారి. నిజానికి ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్లో 15 పరుగులకే అతను వెనుదిరగాల్సింది. బ్రూక్ తేలికైన క్యాచ్ వదిలేయడం సంజుకు కలిసొచ్చి పెద్ద ఇన్నింగ్స్ ఆడాడు. లేదంటే పరిస్థితి వేరుగా ఉండేదేమో. ఏదైతేనేం 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' గెలుచుకుని ప్రపంచకప్ హీరో అయ్యాడు సంజు. అభిమానులూ ఎంతో సంతోషించారు. ఈ ఊపును కొనసాగిస్తూ ఐపీఎల్‌లో కూడా చెలరేగిపోతాడని అందరూ ఆశించారు. ముఖ్యంగా రాజస్తాన్ నుంచి తమ జట్టులోకి సంజును తెచ్చుకున్న చెన్నై సూపర్ కింగ్స్ జాక్ పాట్ కొట్టిందనే చర్చ జరిగింది. కానీ చివరికి చూస్తే సంజు శాంసన్.. తన మార్కు ఆటే ఆడాడు. కొన్ని మెరుపు ఇన్నింగ్స్‌ల తర్వాత, తన మీద భారీ అంచనాలు నెలకొన్నపుడు వరుసగా విఫలమవడం సంజుకు ఎప్పట్నుంచో ఉన్న బలహీనతే. ఈ ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో వరుసగా 6, 7, 9 పరుగులకు పరిమితం అయ్యాడు ఈ ఓపెనింగ్ బ్యాటర్. ప్రపంచకప్‌లో మూడు ఇన్నింగ్స్‌లతో ఆకాశానికి ఎదిగిపోయాడు సంజు. కానీ ఇప్పుడు మూడు ఇన్నింగ్స్‌ల వైఫల్యం అతణ్ని నేలమీదికి తెచ్చేసింది.గత సీజన్లో పేలవ ప్రదర్శన చేసిన చెన్నై.. ఈసారి జట్టులో చాలా మార్పులు చేసింది. రవీంద్ర జడేజాను రాజస్థాన్‌కు పంపించి.. తన స్థానంలోకి సంజును ఏకంగా రూ.18 కోట్లతో తెచ్చుకుంది. అతనేమో కీలకమైన ఓపెనింగ్‌లో పేలవమైన ప్రదర్శన చేస్తున్నాడు. ఒకట్రెండు మ్యాచ్‌ల్లో విఫలమైతే ఏమో అనుకోవచ్చు. కానీ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ సింగిల్ డిజిటల్‌కే పరిమితం అయ్యాడు. మైదానంలో సంజును గమనిస్తే.. తన బాడీ లాంగ్వేజే సరిగా లేదు. తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్లు, పెద్దగా ఉత్సాహం లేనట్లు కనిపిస్తున్నాడు. తన ఆటలో ఆత్మవిశ్వాసం కొరవడింది. ప్రపంచకప్‌లో చెలరేగిపోయిన బ్యాటర్ ఇతనేనా అనిపిస్తోంది. సంజు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న సీఎస్కే తన వైఫల్యంతో భారీ మూల్యమే చెల్లించుకుంటోంది. సంజుతో పాటు మరో ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ కూడా ఘోరంగా విఫలమవుతుండడంతో ఆరంభంలోనే సీఎస్కే తీవ్ర ఒత్తిడిలో పడుతోంది. ముందే ఆశలు నీరుగారిపోతున్నాయి. ఓపెనింగ్ వైఫల్యం ప్రభావం జట్టు మొత్తం మీద పడి చెన్నై పుంజుకోలేకపోతోంది.


రెండు మూడు మ్యాచ్‌లు బాగా ఆడి.. తర్వాత తేలిపోయే సంజు శాంసన్ బలహీనత ఇప్పటిది కాదు. కెరీర్ ఆరంభం నుంచి ఇంతే. 2024లో అతను అంతర్జాతీయ టీ20ల్లో కేవలం అయిదు మ్యాచ్‌ల వ్యవధిలో మూడు శతకాలు బాది సంచలనం సృష్టించాడు. ప్రపంచ క్రికెట్లో ఏ బ్యాటర్‌కూ సాధ్యం కాని ఘనత ఇది. అలాంటి ఆటగాడు తర్వాతి 22 ఇన్నింగ్స్‌ల్లో కేవలం ఒకే ఒక్క అర్ధశతకం సాధించడం గమనార్హం. ఆ 22 ఇన్నింగ్స్‌ల్లో 17.44 సగటుతో 314 పరుగులే చేయగలిగాడు. మళ్లీ టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌తో సూపర్ 8 మ్యాచ్ నుంచి తన ఆట మారింది. వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో పెద్ద స్కోర్లు సాధించాడు. కానీ ఇప్పుడు ఐపీఎల్‌లో భారీ అంచనాల మధ్య బరిలోకి దిగి పేలవ ప్రదర్శన చేస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్లోనే కాదు.. ఐపీఎల్‌లోనూ నిలకడగా ఆడకపోవడమే సంజుకున్న అతి పెద్ద సమస్య. కాబట్టే పదేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నా.. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ ముంగిట కూడా తుది జట్టులో స్థానం ఖరారు కాని స్థితిలో ఉన్నాడు. కానీ అభిమానులు మాత్రం తన వైఫల్యాన్ని గుర్తించక.. తన కెరీర్‌ను సరిగా విశ్లేషించలేక.. అతడికి భారత సెలక్టర్లు అన్యాయం చేస్తున్నారని.. తన ప్రతిభను సరిగా ఉపయోగించుకోవట్లేదని విమర్శలు చేస్తుంటారు. అతనో పెద్ద ఇన్నింగ్స్ ఆడగానే చూశారా సంజు టాలెంట్ ఎలాంటిదో అంటూ ఎలివేషన్లు ఇస్తారు. ప్రపంచకప్ సమయంలో అదే జరిగింది. మరి ఇప్పుడు తన వైఫల్యం గురించి ఫ్యాన్స్ ఏమంటారో?

# ముకేశ్‌పలక్ స్వర్ణ గురి




గ్రానడా (స్పెయిన్): అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి జోరు కొనసాగుతోంది. ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ ప్రపంచకప్‌లో అతడు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పలక్‌తో కలిసి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో ముకేశ్ ద్వయం 487.7 పాయింట్లతో జూనియర్ ప్రపంచ రికార్డు సృష్టిస్తూ అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో చో గయున్‌సంగ్ (కొరియా, 483) జోడీ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. క్వాలిఫికేషన్లో 581 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్న ముకేశ్ జోడీ.. ఫైనల్లోనూ జోరు ప్రదర్శించింది. తుది పోరులో ముకేశ్ 244.7 పాయింట్లు.. పలక్ 243 పాయింట్లు సాధించారు. మరోవైపు క్వాలిఫికేషన్లో అగ్రస్థానంలో నిలిచిన కిన్‌యున్‌కయ్ హు (చైనా, 586) జంట ఫైనల్లో తడబడింది. 484.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. వెరోనిక మజోర్‌అకోస్ కరోలి (హంగేరి, 414.9) జోడీ మూడో స్థానాన్ని దక్కించుకుంది.

# ఆ విదేశీ ఆటగాళ్లపై చర్యలు తీసుకోవాలి ..సునీల్ గావస్కర్




ముంబయి: ఐపీఎల్‌లో తమ పాత్రను పూర్తిగా పోషించని విదేశీ ఆటగాళ్లపై చర్యలు తీసుకోవాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ డిమాండ్ చేశాడు. పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని కేకేఆర్ ఆల్‌రౌండర్ కామరూన్ గ్రీన్ కేవలం బ్యాటింగ్‌కే పరిమితమవుతున్న నేపథ్యంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. ''ఒక మ్యాచ్‌లో ఓ బౌలర్ వేసేది నాలుగు ఓవర్లే. మరి వాళ్లు అలా చేయకుండా అడ్డుకుంటున్నదేంటి?'' అని గావస్కర్ అన్నాడు. ''ఒకవేళ ఆటగాడు ఫిట్‌గా లేకుంటే టోర్నీకి ముందే వైదొలగాలి. మరో ఆటగాణ్ని ఎంచుకునే అవకాశం ఫ్రాంఛైజీకి ఇవ్వాలి'' అని చెప్పాడు. ''బీసీసీఐ రంగంలోకి దిగాలి. తొలి మ్యాచ్ నుంచే అందుబాటులో లేని ఆటగాళ్ల విషయంలో అమలు చేస్తున్న నిబంధనల లాంటివే.. ఫిట్‌నెస్ పేరుతో మ్యాచ్‌లకు పూర్తిగా అందుబాటులో లేని ఆటగాళ్ల కోసం ప్రవేశపెట్టాలి'' అని అన్నాడు. పూర్తి అంకితభావంతో ఆడే ఆటగాళ్లు ఫ్రాంఛైజీలకు కావాలని గావస్కర్ చెప్పాడు.

# అతడు లేనిలోటు తీరనిది.. బ్యాటర్లే మా ఓటములకు కారణం: క్లాసెన్

ఐపీఎల్2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మిశ్రమ ఫలితాలు వస్తున్నాయి. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్‌తో తలపడ్డ సన్‌రైజర్స్ 201 పరుగులు చేసినా.. లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది.

**సొంతమైదానంలో నామమాత్రపు స్కోరు**

తదుపరి కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్‌లో 226 పరుగుల భారీ స్కోరు సాధించిన సన్‌రైజర్స్.. 161 పరుగులకే ప్రత్యర్థిని కుప్పకూల్చి జయభేరి మోగించింది. అయితే, సొంతమైదానంలో ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో మాత్రం ఓటమిపాలైంది. హైదరాబాద్ జట్టు కేవలం 156 పరుగులే చేయగా.. మరో బంతి మిగిలి ఉండగానే లక్నో లక్ష్యాన్ని ఛేదించింది.ఇదిలా ఉంటే.. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (Pat Cummins) ఆరంభ మ్యాచ్‌లకు దూరం కాగా ఇషాన్ కిషన్ (Ishan Kishan) సన్‌రైజర్స్ సారథిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇక కమిన్స్ రూపంలో కీలక పేసర్ సేవలను కూడా జట్టు కోల్పోయింది. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం బలహీనంగా ఉన్నందువల్లే సన్‌రైజర్స్ రాణించలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి.

**బ్యాటర్లు మరింతగా శ్రమించాల్సి ఉంది**

ఈ విషయంపై సన్‌రైజర్స్ పవర్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ తాజాగా స్పందించాడు. తమ వైఫల్యాలకు బ్యాటింగ్ విభాగమే ప్రధాన కారణమంటూ బౌలర్లను సమర్థించాడు. ఈ మేరకు ఎన్డీటీవీతో మాట్లాడుతూ.. ''గత మూడు మ్యాచ్‌లలో మేము 40 పరుగుల మేర వెనుకబడి ఉన్నాం అనిపించింది. కాబట్టి బ్యాటర్లు మరింతగా శ్రమించాల్సి ఉంది.

**అతడు లేనిలోటు తీరనిది**

ప్యాట్ కమిన్స్ వంటి ఆటగాడు లేకపోవడం ఏ ఫార్మాట్లోనైనా ఇబ్బందికరమే. జట్టుకు భారీ నష్టం కూడా! బ్రైడన్ కార్స్ చేతికి గాయమైంది. కాబట్టి మా ప్రణాళికల్లో మార్పు చేయాల్సి వచ్చింది. ఏదేమైనా మా జట్టు అనుభవం ఉన్న జట్టు. ముఖ్యంగా పేస్ దళం బాగుంది. బ్యాట్‌తో మేము కష్టపడ్డ చోట మా వాళ్లు వికెట్లు తీయగలిగారు. బ్యాటర్లుగా మేము మాత్రం అనుకున్న మేర రాణించలేకపోయాము. ఓటములకు మా బౌలర్లను బాధ్యులను చేయడం సులువే. అదనంగా 20 30 పరుగులు చేసి ఉంటే కానీ ఓడిన రెండు మ్యాచ్‌లలో మేము 20 30 పరుగులు అదనంగా చేసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. అలా అయితే మా బౌలర్లు లక్ష్యాన్ని కాపాడగలిగి ఉండేవారు'' అని హెన్రిచ్ క్లాసెన్ బౌలింగ్ విభాగానికి మద్దతుగా నిలిచాడు. కాగా సన్‌రైజర్స్ బౌలింగ్ విభాగంలో హర్ష్ దూబే, జయదేవ్ ఉనాద్కట్, ఎషాన్ మలింగ, హర్షల్ పటేల్, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇదిలా ఉంటే.. కమిన్స్ ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనబడటం లేదు.

